తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-02-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 304 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## కేరళలో లెఫ్ట్ ఫ్రంట్‌పై
# రేవంత్ విమర్శలు

మోదీతో పోల్చుతూ సంచలన వ్యాఖ్యలు

పినరయి విజయన్‌పై తీవ్ర ఆరోపణలు

రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా వ్యాఖ్యలు

**తిరువనంతపురం, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** కేరళలో ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లెఫ్ట్ ఫ్రంట్‌పై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సీపీఐ, సీపీఎం పార్టీలకు ఓటు వేయడం అంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఓటు వేసినట్టేనని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నరేంద్ర మోదీకి నీడలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీరిద్దరూ అన్నదమ్ముల్లా పనిచేస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీశాయి. ఇటీవల ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి ఇళ్లు కూల్చిన అంశంపై పినరయి విజయన్ విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి ప్రతిస్పందించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

మిగతా 2లో..



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిద్దిపేటలో సహాయ కార్యక్రమం

లబ్ధిదారులకు రూ.62 లక్షల చెక్కులు పంపిణీ

ఇప్పటివరకు 12,857 మందికి రూ.41 కోట్ల సాయం

వ్యవసాయం, ఉపాధిలో సిద్దిపేట ముందంజలో ఉందని వ్యాఖ్య

**సిద్దిపేట, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న ప్రజలకు తన వంతు సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయం సిద్దిపేట నియోజకవర్గంలో అందించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 12,857 మందికి రూ.41 కోట్ల 13 లక్షల సాయం అందించామని, ఈ రోజు 300 మందికి రూ.62 లక్షల 88 వేల చెక్కులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చెక్కులను వెంటనే బ్యాంకులో జమ చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సిద్దిపేటలో సాగునీటి పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, గోదావరి నీరు కాలువల్లో ప్రవహిస్తూ పచ్చని పంటలు కనిపిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఎండాకాలంలో కూడా 85 వేల ఎకరాల్లో వరి పండుతుండడం అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు.

మిగతా 2లో..

## గ్రామాల్లో అభివృద్ధి పనులపై జూపల్లి కృష్ణారావు సమీక్ష

దగడపల్లి, చిన్నదగడపల్లిలో గ్రామ సభలు

సంక్షేమ పథకాల అమలుపై విచారణ

అధికారులకు తక్షణ చర్యల ఆదేశాలు



2లో

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- సమీకృత భూభారతి పోర్టల్ ప్రారంభం
- రేపటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మక అమలు
- ఇంటినుంచే భూ సేవలు – రైతులకు సులభతరం
- పారదర్శక వ్యవస్థతో వివాదాలకు ముగింపు దిశగా అడుగు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2లో

## అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై చర్చ

- ప్రతి పేదకు సొంత ఇల్లు లక్ష్యమని భట్టి విక్రమార్క
- 4.50 లక్షల ఇళ్ల మంజూరు వివరాలు వెల్లడి
- గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సభలో ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, సొంత స్థలం కలిగిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.

మిగతా 2లో..



## హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహనకు పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభం

మంత్రి దామోదర్ రాజనర్సింహ చేత పోస్టర్ ఆవిష్కరణ

అల్లు అర్జున్ అభిమాన సంఘం సేవలకు ప్రశంసలు

పిల్లలకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచనలు



2లో



## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- వరంగల్ పోలీసుల విజయవంతమైన ఆపరేషన్
- తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులు పట్టివేత
- రూ.15 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- ఐదు కేసుల్లో నిందితుల ప్రమేయం వెల్లడి

**వరంగల్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను వరంగల్ సీసీఎస్, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు సుమారు రూ.15 లక్షల 20 వేల విలువగల 95 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 2లో..

## మరణానంతరం ముగ్గురికి ప్రాణదానం చేసిన పోలీస్

- రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన కానిస్టేబుల్
- అవయవ దానంతో ముగ్గురికి నూతన జీవితం
- కుటుంబ సభ్యుల గొప్ప నిర్ణయానికి ప్రశంసలు



2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రామాల్లో అభివృద్ధి పనులపై జూపల్లి కృష్ణారావు సమీక్ష

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చిన్నంబావి మండలంలోని దగడపల్లి, చిన్నదగడపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ఆయన సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను జూపల్లి కృష్ణారావు నేరుగా తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, పింఛన్లు వంటి అంశాలపై ప్రజలు తమ సమస్యలను వెల్లడించారు. సమస్యలను శీఘ్రంగా పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండాలని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని మంత్రి హెచ్చరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను అమలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర పురోగతి సాధ్యమవుతుందని జూపల్లి కృష్ణారావు తెలిపారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమీకృత భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భూమి, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ పోర్టల్‌ను ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో మొదటిగా ఈ వ్యవస్థ అమల్లోకి రానుంది. ఈ ప్రయోగ ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ పోర్టల్ ద్వారా రైతులు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే భూ సేవలను పొందగలుగుతారు. రైతు లాగిన్ అయిన వెంటనే తన భూమికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. సర్వే అవసరం ఉంటే దానికి సంబంధించిన ఫీజు వివరాలు కూడా స్పష్టంగా తెలుస్తాయి. ఫీజు చెల్లించిన వెంటనే దరఖాస్తు సంబంధిత సర్వేయర్‌కు చేరుతుంది. తర్వాత రెండు రోజులలో పొరుగు భూమి యజమానులకు నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోపు సర్వే తేదీని నిర్ణయిస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోవర్ పరికరాల ద్వారా సర్వే పూర్తి చేసి వివరాలను వ్యవస్థలో నమోదు చేస్తారు. అనంతరం మండల సర్వేయర్ పరిశీలన, తహసీల్దార్ ఆమోదం తర్వాత రైతుకు ఎల్‌పీఎం, భూధార్ నంబర్లు కేటాయిస్తారు. సర్వే పూర్తయ్యాక మ్యాప్‌ను రూపొందించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతి దశలో రైతుల మొబైల్ నంబర్‌కు సమాచార సందేశాలు పంపుతూ పారదర్శకతను నిర్ధారిస్తారు. భూమి కొనుగోలు, అమ్మకాల సమయంలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేయడం ద్వారా భవిష్యత్తులో వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పాత విధానాల్లో ఉన్న గొలుసులు, కొలత కర్రలు వంటి పరికరాలకు బదులుగా ఆధునిక రోవర్ పరికరాలను ఉపయోగించడం వల్ల సర్వే ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు తెలిపారు. కచ్చితత్వం పెరగడంతో రైతులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. భూ సమస్యలు రైతుల జీవితాల్లో పెద్ద అడ్డంకిగా మారిన నేపథ్యంలో ఈ పోర్టల్ కీలక మార్పుకు నాంది పలుకుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రైతు ఇంటి నుంచే అన్ని సేవలు పొందేలా పారదర్శక వ్యవస్థను తీసుకువస్తూ రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని ఆయన స్పష్టం చేశారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేయబడిన వారిలో కళ్యాణ సుందరం (30), సెల్వరాజ్ (28) మధురై ప్రాంతానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు.

పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు కళ్యాణ సుందరం పూల వ్యాపారం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయాన్ని వ్యసనాలకు ఖర్చు చేస్తూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసగా మారాడు. గతంలో కూడా చోరీలు, మత్తు పదార్థాల విక్రయాలు, ద్విచక్ర వాహనాల దొంగతనాల్లో పాల్గొని పలు మార్లు జైలుకు వెళ్లినట్టు సమాచారం. జైలు నుండి విడుదలైన తర్వాత సెల్ దుకాణంలో పనిచేస్తూ సెల్వరాజ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గత నెలలో వరంగల్‌కు చేరుకొని ముందుగా ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు.

అనంతరం మట్టెవాడ, సుబేదారి, హన్మకొండ, కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధుల్లో మూడు ఘటనలు, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో ఒక ఘటనతో కలిపి మొత్తం ఐదు చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితులు పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు గొలుసులు అపహరించడం వీరి మోసం విధానంగా పోలీసులు తెలిపారు.

ఈ కేసులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితులను గుర్తించారు. వారి కదలికలపై నిఘా పెట్టి, మట్టెవాడ నుంచి హన్మకొండ వైపు వస్తుండగా అనుమానంతో ఆపే ప్రయత్నంలో పారిపోతుండగా పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తారని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు మరింత నిఘా పెంచుతామని తెలిపారు.

# అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, అన్ని నియోజకవర్గాల్లో అర్హులైన వారికి కేటాయిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఆయా నియోజకవర్గాలకు అదనంగా 1000 ఇళ్లను మంజూరు చేసినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు మొత్తం రూ. 22,500 కోట్లు వెచ్చించనున్నట్లు సభలో వెల్లడించారు. ఇప్పటికే రూ. 5,073.84 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌లో గృహ నిర్మాణ శాఖకు రూ. 7,430 కోట్లను కేటాయించినట్లు వివరించారు. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడం వారి ఆత్మగౌరవానికి చిహ్నమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలు స్థిర నివాసాన్ని పొందుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గృహహీనత సమస్యను పూర్తిగా తొలగించడమే ప్రభుత్వ సంకల్పమని అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఈ మార్పు సాధ్యమైందని పేర్కొంటూ, ఒకప్పుడు వలసలు వెళ్లిన ప్రజలు ఇప్పుడు ఇతర రాష్ట్రాల వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారని చెప్పారు. రైతులు మిర్చి, ఆయిల్ పామ్ వంటి పంటలతో లాభాలు పొందుతున్నారని తెలిపారు. పరిశ్రమలు, ఐటీ రంగాల్లో కూడా సిద్దిపేట అభివృద్ధి చెందుతోందని, మిట్టపల్లి ఇండస్ట్రియల్ కారిడార్, ఐటీ పార్క్ ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. అన్ని రంగాల్లో సిద్దిపేటను ముందంజలో నిలిపామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు.

## ఫూలిష్ చర్య!

ఫూల్స్ ఫూల్స్ ఫూల్స్
ఒకడికొకడు ఫూల్స్
ఫూల్స్ ఫూల్స్ ఫూల్స్
ప్రపంచమంతా ఫూల్స్
యుద్ధపిపాసకులు
అంతాగ్లోబల్ ఫూల్స్!

పాతమాటలే మరోసారి
మనిషిని మరో మనిషి
జాతిని మరో జాతి
దేశాన్ని మరోదేశం
పీడించుకు తినటం
ఎన్నాళ్లీ అమానుషత్వం!

పీడిస్తూ తాడిస్తూ
ఓడిస్తూ క్రీడిస్తూ
వాడు నీకు తక్కువ
నువ్వుమరొకడికితక్కువ
తక్కువఎక్కువలతో
అందరూ ఫూల్స్ ఫూల్స్!

యుద్ధాలు చేసి ఫూల్స్
యుద్ధంచెయ్యలేకఫూల్స్
మొదలెట్టిఫూల్స్
ముగించలేక ఫూల్స్
వాడికినువ్వునీకువాడు
ఒకడికొకడు ఫూల్స్!

గల్లీ నుంచి ఢిల్లీ
ఢిల్లీ నుంచి గ్లోబల్
అమెరికా ఇజ్రాయేల్
తరతమ స్థాయిల్లో
అందరిదీ ఒకే బుద్ధి
దోచుకు తినేయాలి!

మీ దోపిడీ బుద్ధికి
మానవత్వం లేదు!
శిశు బాల స్త్రీ వృద్ధులు
వాళ్ళేం చేసారు పాపం
నరహంతకుల్లారా!
మీరు చావకపోయారా!

స్వార్ధపూర్వక యుద్ధాలు
పేరే సామ్రాజ్యవాదం!
పేరుగొప్ప ప్రపంచం దిబ్బ
దోచుకుతినేయాలని
బలహీనులమీద
ఎగబడిపోవటం!

ఏం సాధించావు నువ్వు
బూడిద మిగిల్చావు!
కాలం మార్పుగమనించు
మతాలు యుద్ధాలు
అవసరం లేకుండానే
నువ్వు దోచుకోవచ్చు!

మీరంతాకుమ్మక్కయి
కూడబలుక్కుని
'మెత్తగా'దోచేయండి!
ప్రజల చైతన్యంముందు
యుద్ధాలు పనికిరావు!
చివరికి ఏమైంది!

ఇరాన్ 'ఘాటు' చూసి
పిచ్చెక్కిపోతోంది!
గొప్పగామొదలెట్టావు
ముంగిపు నీవల్లకాదు!
నువ్వొకటితలిస్తే
ఇరాన్మరొకటితలచింది!

మాకృష్ణపరమాత్మన్నట్టు
యుద్ధమే తప్పనిచో
"సాగరములన్నియు
ఏకము కాకపోయి
'అని' వత్తురు చత్తురు "
యుద్ధంఒకఫూలిష్ చర్య

**- తమ్మినేని అక్కిరాజు**
**హైదరాబాద్ , ఏప్రిల్ -ఫూల్ -2026**

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహనకు పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం విస్తృతంగా చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన నివాసంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌కు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రముఖ నటుడు అల్లు అర్జున్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పోస్టర్‌ను సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు ప్రధాన కారణమైన హ్యూమన్ పాపిల్లోమా వైరస్ నుంచి రక్షణ పొందేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అత్యంత సురక్షితమైన మరియు ప్రభావవంతమైన మార్గమని వివరించారు. ఈ టీకా ద్వారా దీర్ఘకాలిక రక్షణ లభిస్తుందని, ముఖ్యంగా బాలికల ఆరోగ్య పరిరక్షణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ టీకా అందుబాటులో ఉందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం ఉన్న నేపథ్యంలో ఈ ప్రచార కార్యక్రమాలు మరింత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అల్లు అర్జున్ అభిమాన సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సినీ అభిమాన సంఘాలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి సంస్థలు ముందుకు రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు.

9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ఈ వయస్సులో టీకా వేయించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. తల్లిదండ్రులు ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తమ పిల్లలకు టీకా వేయించేందుకు ముందుకు రావాలని కోరారు. సమాజంలో వ్యాధుల నియంత్రణకు టీకాలు కీలకమైన సాధనమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా మాత్రమే ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చని, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# మరణానంతరం ముగ్గురికి ప్రాణదానం చేసిన పోలీస్




**హైదరాబాద్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** అంబర్‌పేట పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కంబాల శంకర్ రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ కావడం తీవ్ర విషాదానికి గురిచేసింది. సేవా భావంతో పనిచేసిన ఈ పోలీస్ సిబ్బంది మరణం సహచరుల్లో దిగ్భ్రాంతిని కలిగించింది. ఇలాంటి క్లిష్ట సమయంలో కూడా శంకర్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. పుట్టెడు దుఃఖంలోనూ ఆయన తండ్రి గొప్ప మనసుతో శంకర్ అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. శంకర్‌కు చెందిన రెండు కిడ్నీలు, లివర్‌ను దానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాపాయం నుంచి బయటపడి నూతన జీవితం పొందారు. ఈ అవయవ దానం మరో ముగ్గురు జీవితాల్లో వెలుగులు నింపింది. అవయవ దానం ద్వారా మరణానంతరం కూడా ప్రాణాలను కాపాడవచ్చని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. శంకర్ కుటుంబ సభ్యుల ఉదారతకు పోలీసులు, ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఘటన సమాజంలో అవయవ దానం పట్ల అవగాహన పెంచాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. మరెందరికో ప్రేరణగా నిలిచే ఈ సేవాభావాన్ని పలువురు కొనియాడుతున్నారు. మరణానంతరం కూడా జీవాలను రక్షించిన పోలీస్ సోదరుడు కంబాల శంకర్‌కు ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యుల త్యాగాన్ని అందరూ స్మరించుకుంటున్నారు.

# కేరళలో లెఫ్ట్ ఫ్రంట్‌పై రేవంత్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల కేరళ పర్యటనలో భాగంగా రేవంత్ రెడ్డి సీపీఐ, సీపీఎం పార్టీల లెఫ్ట్ ఫ్రంట్‌ను ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ వ్యాఖ్యలు మరింత తీవ్రతరంగా వినిపించాయి. అయితే తెలంగాణలో సీపీఐతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం నడుపుతున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది రాజకీయ వ్యూహంలో భాగమా లేక అవకాశవాదమా అన్న చర్చ కొనసాగుతోంది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై వివిధ పార్టీల నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు దీనిని రాజకీయ అవసరంగా చూస్తుండగా, మరికొందరు ఇది అవకాశవాదానికి పరాకాష్టగా అభివర్ణిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
గురువారం - 2- ఏప్రిల్ 2026


# పోచమ్మ గుడి వీధిలో సి.సి రోడ్డు పనులకు శ్రీకారం

- డ్రైనేజీ వివాదం పరిష్కారం
- ప్రజల సమ్మతితో ముందుకు పనులు

**నాచారం, ఏప్రిల్ 1(తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ రాఘవేంద్ర నగర్ పరిధిలోని పోచమ్మ గుడి వీధిలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చివరకు శ్రీకారం చుట్టారు. గతంలో కార్పొరేటర్‌గా ఉన్న శాంతి సాయిజెన్ శేఖర్ ఈ రహదారి నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయించగా, తాజాగా పనులు ప్రారంభమయ్యాయి.మంగళవారం ఉదయం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు రాగా, కొంతమంది స్థానికులు డ్రైనేజీ సమస్యను ప్రస్తావిస్తూ ముందుగా పైపులైన్ మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు పనులు నిలిచిపోయాయి.ఈ విషయంపై బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం సివరేజ్ సూపర్వైజర్‌తో చర్చించి, ప్రస్తుతం పైపులైన్ మార్పులు అవసరం లేదని స్పష్టం చేశారు. మ్యాన్‌హోల్స్ వద్ద పందికొక్కులు తవ్వడం వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించి, వాటిని సిమెంట్ ప్లాస్టరింగ్ ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ నిర్ణయానికి స్థానికులు అంగీకరించి, రోడ్డు పనులకు సహకరించారు.దీంతో సి.సి రోడ్డు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్, నరేందర్ గౌడ్, ఉపేందర్ గౌడ్, మన్సూర్, అషు, విఠల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ

**3280 అడుగుల జెండాతో ప్రత్యేక ఆకర్షణ**

**చర్లపల్లి, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ చైర్మన్ గడ్డం యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 3280 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తి భావాలను వ్యక్తపరిచారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి "జై హింద్", "వందే మాతరం" నినాదాలతో ప్రాంతాన్ని దేశభక్తి వాతావరణంతో నింపారు. పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో చెర్లపల్లి సీఐ సుధాకర్, ఎస్ఐ శేఖర్, ఈసీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు సీతారాం రెడ్డి, కెవి ఎల్ ఎన్ రావు, నరేందర్, వెంకటేష్, మనోహర్, ప్రేమ్, ఆనంద్ రాజ్ గౌడ్, రామచంద్ర గౌడ్, రెడ్డి నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.






# కంఠమయ్య గుడి అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయాలి

- మేడ్చల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

కుషాయిగూడలో గౌడ కులస్థుల ఆరాధ్యదైవంగా ప్రసిద్ధి చెందిన శ్రీ కంఠమహేశ్వర స్వామి (కంఠమయ్య) ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆలయంలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆలయ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినతిపై సానుకూలంగా స్పందిస్తూ, త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, బుడంపల్లి రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఈసీఐఎల్ చౌరస్తాలో కార్మికుల నిరసన ర్యాలీ

- పని గంటల పెంపు, ఉద్యోగ భద్రతపై ఆందోళన
- ఏఐటీయూసీ నేతల పిలుపు

**కుషాయిగూడ, ఏప్రిల్ 1(తెలంగాణ ముచ్చట్లు)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం జరిగింది.ఈసీఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద కార్మికులు "బ్లాక్ డే"గా పాటిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్. బోస్ మాట్లాడుతూ, ఈ లేబర్ కోడ్లు కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి అని అన్నారు. ఇది చట్టాల మార్పు కాదని, కార్మిక హక్కులను అపహరించే చర్యలని విమర్శించారు. కార్మికుల శ్రమను చౌకగా మార్చి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఈ కోడ్లు రూపొందించబడ్డాయని పేర్కొన్నారు.కొత్త కోడ్ల ద్వారా పని గంటలు పెరగడం వల్ల కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఉద్యోగ భద్రత క్షీణిస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా 300 మందికి లోపు ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ప్రభుత్వ అనుమతి లేకుండానే ఉద్యోగాలను తొలగించే అవకాశం కల్పించడం ఆందోళనకరమని అన్నారు. యూనియన్ హక్కులపై పరిమితులు విధించడం వల్ల కార్మికుల స్వరాన్ని అణచివేస్తున్నారని విమర్శించారు.కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదలతో పర్మినెంట్ ఉద్యోగాలు తగ్గిపోతాయని, వేతనాలు, బోనస్, సామాజిక భద్రత అంశాలు బలహీనపరుస్తున్నాయని అన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నిరసన అనంతరం కుషాయిగూడ పోలీసులు ఏఐటీయూసీ నాయకులను అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ నేతలు ఎస్. శంకర్ రావు, నారా నర్సింహా, జోషి, రాఘవేంద్ర రావు, నర్సింహా రావు, లక్ష్మీనారాయణ, మోహన్, చలం, గండాలు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, టి. సత్య ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్ పాల్గొన్నారు.







# జడ్పీహెచ్ఎస్‌లో బయోగ్యాస్, ఆర్వో ప్లాంట్ల ప్రారంభం

- వోయిత్ టర్బో సిఎస్ఆర్ నిధులతో రూ.5 లక్షల అభివృద్ధి
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మల్లాపూర్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

నాచారం ఇండస్ట్రీ పరిధిలోని ప్రముఖ సంస్థ వోయిత్ టర్బో ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధుల ద్వారా మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్, ఆర్వో వాటర్ ప్లాంట్‌ను స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట గ్యాస్ ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అలాగే విద్యార్థుల్లో పునరుత్పాదక ఇంధనంపై అవగాహన పెంపొందుతుందని అన్నారు. ఇకపోతే, లైబ్రరీ అభివృద్ధికి అవసరమైన అల్మారాలు, కుర్చీలు కూడా సంస్థ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు, వోయిత్ టర్బో సంస్థ ప్రతినిధులు ఈశ్వర్ ప్రసాద్ (వైస్ ప్రెసిడెంట్), మోహనరెడ్డి, రాజశేఖర్ రెడ్డి (జనరల్ మేనేజర్లు), ఇంద్రజ, మహేష్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్ కుమార్, ధర్మా రెడ్డి, కాసం రాజిరెడ్డి, దుల్మిట్టా దయాకర్ రెడ్డి, మెండ రఘువరన్, ప్రమోద్ తదితరులు హాజరయ్యారు.








# వార్డుల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి:రిహానా కమల్ పాషా

- డ్రైనేజీ, శుభ్రతపై ఆదేశాలు.

**సత్తుపల్లి, ఏప్రిల్ 1(తెలంగాణ ముచ్చట్లు):**

పట్టణంలోని ప్రతి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం పనిచేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని 22వ వార్డులో ఆమె విస్తృతంగా పర్యటించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. పర్యటనలో భాగంగా వార్డు సభ్యులు, స్థానికులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థలో పూడికతీత, కొత్త కాలువల నిర్మాణంపై చర్చించారు. చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా అనే విషయాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వార్డు సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేశారు. ప్రజల చెంతకే పాలన అందించడమే లక్ష్యమని, వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.



# పామిరెడ్డిపల్లిలో అంగన్వాడీ కేంద్రాల్లో బాలామృతం పంపిణీ

**పెద్దమందడి,ఏప్రిల్01( తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు 1 మరియు 2లో ఎన్‌హెచ్ఈడీ సమావేశం గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా 7 నెలల నుండి 3 సంవత్సరాల లోపు పిల్లలకు టేక్ హోమ్ రేషన్ కింద బాలామృతం పంపిణీ చేశారు.సమావేశంలో భాగంగా చిన్నారుల బరువు, ఎత్తును కొలిచి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.బాలామృతం నాణ్యతపై తల్లులు, పిల్లల అభిప్రాయాలను సర్పంచ్ తెలుసుకున్నారు. సకాలంలో బాలామృతం అందకపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని తల్లులకు సూచించారు.అలాగే అంగన్వాడీ కార్యకర్తలు సమయపాలన పాటిస్తూ సేవలు అందించాలని సర్పంచ్ ఆదేశించారు. అందిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యతను పరీక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ నాయక్, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, సునీత, ఆశా వర్కర్ హేమలత, కమిటీ సభ్యులు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# పారాక్వాట్ నియంత్రణపై అసెంబ్లీ తీర్మానం సమయోచిత నిర్ణయం

- డా. జి. ఆదిత్య రెడ్డి

**వనపర్తి,ఏప్రిల్01(తెలంగాణ ముచ్చట్లు):**



పారాక్వాట్ (గడ్డి మందు) తయారీ మరియు వినియోగంపై సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన నిర్ణయంగా నిలిచింది.ఈ నిర్ణయం సమయోచితమని ఏఐపీసీ స్టేట్ ప్రెసిడెంట్ డా. జి. ఆదిత్య రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరియు సంబంధిత మంత్రులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పారాక్వాట్ వంటి ప్రమాదకర రసాయనం అనుకోకుండా లేదా ఆత్మహత్యల కోసం వినియోగించబడుతూ తీవ్రమైన విషప్రభావాలకు, అనేక మరణాలకు కారణమవుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ రసాయనం ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపి ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తుందని, దీనికి సమర్థమైన యాంటీడోట్ అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నదని వివరించారు.ఈ నేపథ్యంలో ఇటువంటి ప్రమాదకర రసాయనాలపై కట్టుదిట్టమైన నియంత్రణ విధించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా పారాక్వాట్ వినియోగంపై పర్యవేక్షణను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో విషప్రభావ ఘటనలను తగ్గించడం, రైతుల్లో అవగాహన పెంపు, సురక్షిత ప్రత్యామ్నాయాల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.ఈ తీర్మానం మానవతా దృక్పథంతో తీసుకున్న బాధ్యతాయుత నిర్ణయంగా నిలుస్తుందని, ప్రజల ప్రాణాలను రక్షించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని డా. జి. ఆదిత్య రెడ్డి అభివర్ణించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## 33 ఫీట్ల రోడ్డును సర్వే చేసి హద్దులు సూచించాలి

**హసన్ పర్తి,ఏప్రిల్ 01(తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలం వంగపహాడ్ గ్రామం నుండి దామెర మండలం వెంకటాపురం గ్రామాల పూర్వకాలంలో ఉన్న 33 ఫీట్ల రోడ్డును సర్వే చేసి హద్దులు సూచించాలని ఆయా గ్రామాల రైతులు హసన్ పర్తి మండల తహసిల్దార్ పూజారి కిరణ్ కుమార్ కు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీ కుమార్ తో కలిసి వినతి పత్రం అందజేశారు. వంగపహాడ్ గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 324 నుండి దామెర మండలం వెంకటాపురం గ్రామాల శివారు సరిహద్దుల వరకు పూర్వకాలంలో నక్షలో ఉన్న 33 ఫీట్ల రోడ్ ప్రస్తుతం ఆక్రమణకు గురైందని వెంటనే దీనిపై సర్వే చేసి హద్దులు సూచించి రోడ్డును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో రైతులు మండలానికి చేరుకొని తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో సంబంధిత రెవెన్యూ ఇన్స్పెక్టర్ కి వెంటనే సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జట్టి రవీందర్,రాజగోపాల్ రెడ్డి,శంకర్ రెడ్డి,చేరాలు, కుమార్,సారయ్య,రాజ్ కుమార్,విక్రమ్,బిక్షపతి, రాజు,సూరయ్య,స్వామి,రవి,బిఆర్ఎస్వి కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ డాక్టర్ జట్టి రాజేందర్,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రాధిక ఎక్స్ రోడ్డులో దాడి

_పార్కింగ్ వివాదం ముదిరి వ్యాపారిపై దాడి
– ఇద్దరిపై కేసు నమోదు



**కుషాయిగూడ, ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలో కుషాయిగూడ ప్రాంతంలోని రాధిక ఎక్స్ రోడ్డులో పార్కింగ్ వివాదం దాడికి దారితీసిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఫిర్యాదుదారు మామిడి విగ్నేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, ఆయన తండ్రి మామిడి సంతోష్ గౌడ్ (44), వ్యాపారి, మార్చి 30న మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో తన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని రాధిక ఎక్స్ రోడ్డులోని ఒక షాపు ముందు పార్క్ చేస్తుండగా ఘటన జరిగింది.
అక్కడ ఇప్పటికే ఉన్న మరో టూ వీలర్‌ను ఇద్దరు వ్యక్తులు తీసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, “పక్కన నుంచి వెళ్లవచ్చుగా” అని సంతోష్ గౌడ్ చెప్పడంతో మాటల తగాదా చెలరేగింది. ఈ క్రమంలో ఆ ఇద్దరు వ్యక్తులు దుర్భాషలాడుతూ సంతోష్ గౌడ్‌పై పిడిగుద్దులు కురిపించి, రాయితో ముక్కుపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.గాయపడిన సంతోష్ గౌడ్‌ను వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ఈ ఘటనలో పాల్గొన్న రాహుల్ జైస్వాల్, పార్థ్ కుమార్ చౌదరి అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ట్యాంకులకు కొత్త శక్తి

- కనిపించని లక్ష్యాలపై దాడి సామర్థ్యం పెంపు
- లోయిటరింగ్ మ్యూనిషన్‌లపై భారత సైన్యం దృష్టి
- బియాండ్ లైన్ ఆఫ్ సైట్ దాడులకు సిద్ధం
- ఆధునిక యుద్ధానికి సరికొత్త వ్యూహం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా భారత సైన్యం కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. ట్యాంకుల ద్వారా నేరుగా ప్రయోగించగల స్వదేశీ లోయిటరింగ్ మ్యూనిషన్‌లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.
ప్రస్తుతం టి72, టి90, అర్జున్ ట్యాంకులపై అమర్చిన 81 మిల్లీమీటర్ స్మోక్ గ్రెనేడ్ లాంచర్ల నుంచే ఈ మ్యూనిషన్‌లను ప్రయోగించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనివల్ల ట్యాంకులకు బియాండ్ లైన్ ఆఫ్ సైట్ దాడి సామర్థ్యం లభిస్తుంది.
యుద్ధభూమిలో దాగి ఉన్న యాంటీ ట్యాంక్ మిసైల్ బృందాలు, డ్రోన్ ఆధారిత దాడులు, కనిపించని ప్రమాదకర స్థావరాలను గుర్తించి వెంటనే దాడి చేయడమే ఈ సాంకేతికత ప్రధాన లక్ష్యం. రియల్ టైమ్ సమాచారం సేకరణతో పాటు స్వయంచాలకంగా లక్ష్యాలను గుర్తించి ఖచ్చితమైన దాడులు చేసే సామర్థ్యం దీనిలో ఉంటుంది.
ప్రత్యేకంగా, బాహ్య డ్రోన్ సహాయం లేకుండానే ట్యాంకులు స్వయంగా ప్రమాదాలను గుర్తించి ఎదుర్కొనేలా ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే ఉన్న ట్యాంకుల్లో పెద్ద మార్పులు అవసరం లేకుండా అమలు చేయడం మరో ముఖ్యమైన లక్షణంగా భావిస్తున్నారు. ఈ ప్రణాళిక అమల్లోకి వస్తే భారత సైన్యానికి యుద్ధరంగంలో మరింత ఆధిక్యం లభించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే



**వనపర్తి,ఏప్రిల్ 01(తెలంగాణ ముచ్చట్లు):** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో వేగం పెరిగిందని ఆయన పేర్కొన్నారు.ఇప్పటివరకు 15 విడతల్లో మొత్తం 12,082 మంది లబ్ధిదారులకు రూ. 714 కోట్లకు పైగా చెక్కుల రూపంలో అందించామని తెలిపారు. ఇందులో సీఎంఆర్ఎఫ్ ద్వారా వేలాది మందికి, కల్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద ప్రజల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామని వివరించారు. అదనంగా అత్యవసర వైద్యం కోసం కూడా పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు.మహిళల సాధికారత కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారి ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తున్నామని, వనపర్తి నియోజకవర్గంలోనే భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే బీమా పథకాలు, కొత్త పింఛన్లు, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్, రైతు భరోసా, రుణమాఫీ, పంటలకు ప్రోత్సాహకాలు వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గతంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల వల్లే నేడు రైతులకు నీరు అందుతున్నదని, వాటిపై ఇతరులు కీర్తి తీసుకోవడం సరి కాదని విమర్శించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, సంక్షేమం మరియు అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహా మాల మిత్ర సంఘానికి కొత్త కార్యవర్గం ఎన్నిక

- 2026–2028 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు



**కాప్రా, ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్.పీ కాలనీ డివిజన్ పరిధిలో మహా మాల మిత్ర సంఘం సర్వసభ్య సమావేశం ఇటీవల నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంఘ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా 2026-2028 కాలానికి కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి నరేందర్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సూర్య ప్రకాశ్ బి., కోశాధికారిగా జగదీశ్వర్ రావు ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా మలయాద్రి, బాల భాస్కర్ ఆర్., ఎస్. బాలరాజ్ ఎంపిక కాగా, సహ కార్యదర్శులుగా ఏ. సత్యమూర్తి, కె. ప్రేమ్ సాగర్, ఆర్. ఉదయ్ కుమార్ కిరణ్ బాధ్యతలు స్వీకరించారు.ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ధరా రవి, జె. అప్పా రావు, జి. మధు గోపీ నియమితులయ్యారు.సాంస్కృతిక కార్యదర్శులుగా బి. కాంతారావు, ఎ. మురళి ఎంపికయ్యారు. సలహా కమిటీగా బి. దేవరాజ్, ఏ. సుధాకర్, బాల నర్సయ్య, రాములు, బండి లక్ష్మణ్, శ్రీనివాస్, బాలయ్యలను నియమించారు.సమావేశంలో కొత్త కార్యవర్గం సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.

## అహ్మద్‌గూడలో దాంపత్య విభేదాలు విషాదాంతం

- డాక్టర్ ఆత్మహత్య
- భార్య ఫిర్యాదు, తండ్రి ఆరోపణలతో రెండు కేసులు నమోదు
- అన్ని కోణాల్లో దర్యాప్తు



**కీసర, ఏప్రిల్ 01(తెలంగాణ ముచ్చట్లు)** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో కీసర మండలంలోని అహ్మద్‌గూడలో దాంపత్య విభేదాలు ఒక కుటుంబంలో విషాదాన్ని మిగిల్చాయి. శ్రీ లక్ష్మీ ఎన్‌క్లేవ్‌కు చెందిన పి. వీణపాణి మరియు ఆమె భర్త డా. పసల జోసెఫ్ వినోద్ కుమార్ మధ్య కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 31న వీణపాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.అదే రోజు సాయంత్రం మృతుడి తండ్రి పసల ఆరోగ్యమయ్య పోలీస్ స్టేషన్‌కు హాజరై, తన కుమారుడు జోసెఫ్ వినోద్ కుమార్ (40) తన భార్య చేత మానసిక వేధింపులకు గురై, రాంపల్లి దయ్యారా ఔటర్ రింగ్ రోడ్ వద్ద తన కారులో గుర్తుతెలియని ఇంజెక్షన్ ద్వారా ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. ప్రస్తుతం ఈ రెండు కేసులను అనుసంధానించి దర్యాప్తు కొనసాగుతోంది. అన్ని కోణాల్లో పరిశీలించి, సాక్ష్యాధారాల ఆధారంగా తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కీసర పోలీస్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి అంజనేయులు తెలిపారు.





## జిల్లాలో ఘనంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జన్మదిన వేడుకలు

- కేక్ కటింగ్, అన్నదానం నిర్వహించిన
- జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 1(తెలంగాణ ముచ్చట్లు)** తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేల్పుల మురళి ఎస్సీ కాలనీలో కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైరాలోని అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేల్పుల మురళి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాము. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం తపన పడే మనిషి అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించే మనిషి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సైబర్ మోసగాళ్లపై పోలీసుల ఉక్కుపాదం

- కాల్ సెంటర్ గుట్టురట్టు
- వాట్సాప్ ట్రేడింగ్ మోసం బట్టబయలు
- బాధితుడి నుంచి లక్షలు దోచుకున్న గ్యాంగ్ అరెస్ట్
- రూ.36 లక్షల మోసం కేసులో 8 మంది అరెస్ట్
- భారీ ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం




**ప్రజలకు హెచ్చరిక:**
సోషల్ మీడియాలో వచ్చే తక్కువ సమయంలో భారీ లాభాలు ఇస్తామనే ప్రకటనలను నమ్మవద్దని పోలీసులు సూచించారు. పెట్టుబడులు పెట్టే ముందు సంస్థల విశ్వసనీయతను ఖచ్చితంగా నిర్ధారించుకోవాలని, అపరిచితులకు డబ్బులు పంపడంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

**మల్కాజిగిరి, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సైబర్ క్రైమ్ పోలీసులు కీలక ఆపరేషన్ నిర్వహించి, నకిలీ ట్రేడింగ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాల్ సెంటర్ గుట్టును రట్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి క్రైమ్ నంబర్ 185/2026 కింద కేసు నమోదు చేసి, మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు.నాగోల్‌కు చెందిన అధ్యాపకుడు గుర్రం నవీన్ చందర్ (35) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు వెలుగులోకి వచ్చింది. నిందితులు “బార్క్లేస్” పేరుతో వాట్సాప్ గ్రూప్ సృష్టించి, ట్రేడింగ్‌లో భారీ లాభాలు వస్తాయని నమ్మబలికారు. నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లో సుమారు రూ.7 కోట్ల లాభం వచ్చినట్లు చూపించి బాధితుడి విశ్వాసాన్ని పొందారు. దీంతో బాధితుడు విడతల వారీగా రూ.36,35,010 పెట్టుబడి పెట్టాడు. చివరకు కేవలం రూ.5,000 మాత్రమే తిరిగి రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.ఇన్‌స్పెక్టర్ జి. సుధాకర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాల ద్వారా నిందితుల ఆచూకీని గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పెద్దమీరం గ్రామంలో మార్చి 31న వారిని అదుపులోకి తీసుకున్నారు.
నిందితుల వద్ద నుంచి 45 మొబైల్ ఫోన్లు, 1 ల్యాప్‌టాప్, 3 రౌటర్లు, 2 ట్యాబ్‌లు, 22 చెక్ బుక్కులు, 40 ఏటీఎం కార్డులు, 20 సిమ్ కార్డులు, అలాగే పలు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపీఎస్ పర్యవేక్షణలో, డిసిపి సైబర్ క్రైమ్స్ ఎస్.వి. నాగ లక్ష్మి, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా ఛేదించారు.

## ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం – వ్యక్తి పై కేసు నమోదు

-- పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి

**పెద్దమందడి,ఏప్రిల్01( తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలానికి చెందిన ఒక మైనర్ బాలికపై, మంగంపల్లి తండా నివాసి నున్సావత్ అనిల్ ప్రేమ పేరుతో వెంటపడుతూ మాయమాటలు చెప్పి ఆమెను శారీరకంగా వాడుకొని మోసిన ట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్సై జలంధర్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదులో, నిందితుడు బాలికను మానసికంగా భ్రమలో పడేలా చేసి, వాస్తవ పరిస్థితులను దాచుతూ మోసగట్టినట్టు ఫిర్యాదురాలు ఫిర్యాదు మేరకు పెదమందడి ఎస్సై జలంధర్




రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు బాలిక కుటుంబ సభ్యుల నుండి పూర్తి వివరాలు సేకరిస్తూ, నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జలంధర్ రెడ్డి తెలిపారు.



## స్టార్ హాస్పిటల్‌లో గురుక్కల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యేలు

_హృదయ శస్త్రచికిత్స విజయవంతం
– కుటుంబానికి ధైర్యం చెప్పిన ప్రజాప్రతినిధులు



**హైదరాబాద్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ బంజారా హిల్స్‌లోని స్టార్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న పాండిచేరి రాష్ట్రం తిరునల్లార్ శ్రీ దర్భారన్యేశ్వర స్వామి దేవస్థానం పూజారి మహాలింగ గురుక్కల్‌ను పరామర్శించారు.ఇటీవల గురుక్కల్‌కు జరిగిన హృదయ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో ఎమ్మెల్యేలు ఆనందం వ్యక్తం చేశారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గురుక్కల్ కుమారుడు దిలీప్ స్వామికి ధైర్యం చెప్పి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గురుక్కల్ ఆశీర్వచనాలను స్వీకరించారు.అలాగే, స్టార్ హాస్పిటల్ డైరెక్టర్ డా. గుడపాటి రమేష్‌ను మహాలింగ గురుక్కల్ సన్మానించి ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ఉప్పలపాటి శ్రీకాంత్, నర్నె శ్రీనివాస్ రావు, సోలిస్ కంటి హాస్పిటల్ చైర్మన్ నందనంపాటి రాము, అరికపూడి ప్రసాద్, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్, శంకర్ బాబు, రామకృష్ణ, సుబ్బా రావు, లక్ష్మణ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యపై నెమలి అనిల్ కుమార్ పర్యటన

- కాలనీల్లో సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన
- అధికారులకు తక్షణ చర్యల ఆదేశాలు

**మల్లాపూర్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవాని నగర్ కాలనీ, కేవల్ రెడ్డి నగర్ కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యపై స్థానిక నాయకుడు నెమలి అనిల్ కుమార్ స్పందించారు. గతంలో నిర్వహించిన బస్తీబాటు కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల నేపథ్యంలో ఆయనే స్వయంగా కాలనీలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా మల్లాపూర్ వాటర్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజనీర్ రోహిత్‌తో కలిసి పర్యటించిన అనిల్ కుమార్, నీటి సరఫరాలో అంతరాయం, తక్కువ ప్రెషర్, కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కొరత వంటి సమస్యలను గుర్తించారు.సమస్యలపై అధికారులతో చర్చించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు సమృద్ధిగా, నిరంతరంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సీనియర్ నాయకులు దంతూరి రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్, ధర్మారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, లండన్ భారత్, నర్సింహ, శ్రీనివాస్, హఫీజ్, లైన్ మెన్‌లు పరమేష్ చారి, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.




# అవినీతికి 'నో'.. అర్పీలకు గట్టి హెచ్చరిక!

- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ స్పష్టం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీలో అవినీతికి ఎలాంటి తావు లేదని, అర్పీలు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఘాటుగా హెచ్చరించారు.

బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అర్పీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణ పరిశుభ్రత నుంచి అభివృద్ధి పనుల వరకు అర్పీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా డోర్ టు డోర్ చెత్త సేకరణలో అర్పీలు ప్రజలకు దగ్గరగా ఉండి సేవలు అందించాలన్నారు. సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించే బాధ్యత అర్పీలదే అని గుర్తు చేశారు. అయితే లోన్లు ఇప్పించే పేరుతో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తమకు అందినట్లు తెలిపారు. ఇలాంటి అవినీతి చర్యలను అస్సలు సహించబోమని స్పష్టం చేశారు.

"ఎక్కడైనా డబ్బులు అడిగితే వెంటనే మాకు లేదా ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వండి... తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఖాయం" అని చైర్మన్, కమిషనర్ హెచ్చరించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, మెప్మా ఇంచార్జి టి.ఎం.సి మల్లీశ్వరి, సి.ఎల్. అర్పీలు, అర్పీలు, సమాఖ్య ఓబీలు తదితరులు పాల్గొన్నారు.



## నీరు లేక నిస్సహాయంగా వాడిపోతున్న పంటలు...
# కన్నీటిలో మునిగిన రైతుల ఆవేదన

- కెనాల్ మూతతో ఎండిన పంటలు... రైతుల ఆవేదనకు అండగా ప్రశాంత్ కుమార్
- నీళ్లు వదలకపోతే పరిస్థితి దారుణం! అధికారులకు ఫోన్‌లోనే అలర్ట్

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు)** ఒకవైపు కెనాల్ మూత... మరోవైపు అకాల గాలులు... ఈ రెండు దెబ్బలతో రైతుల పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో జమ్మికుంట పరిసరాల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ వెంటనే స్పందించి రైతులకు భరోసా కల్పించారు.



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో ఎండిపోతున్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించిన ఆయన, రైతుల సమస్యలను ఆత్మీయంగా విన్నారు. "ఈసారి కెనాల్ ముందే మూసేశారు... నీళ్లు లేక పంటలు పూర్తిగా నష్టపోతున్నాయి" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేయగా, వెంటనే చైర్మన్ స్పందించారు.

9R15 కెనాల్‌ను ముందుగానే మూసివేయడంతో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని గుర్తించిన ప్రశాంత్ కుమార్, స్థానిక డిఈ, ఈఈలకు ఫోన్ చేసి కనీసం ఏప్రిల్ 10 వరకు నీటిని విడుదల చేయాలని గట్టిగా కోరారు.

అంతేకాకుండా ఈ సమస్యను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, జిల్లా కలెక్టర్ స్థాయిలో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఇటీవల వచ్చిన అకాల గాలులతో పంటలు దెబ్బతిన్న దృశ్యాలు కూడా ఆయనను కలచివేశాయి. ఈ నష్టాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి రైతులకు తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

ఈ సందర్భంగా రైతులు చైర్మన్ వెంటనే స్పందించిన తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎగిత సుజాత అశోక్, దయ్యాల శ్రీనివాస్, కొమ్ము అశోక్, కొమ్ము నరేష్, మహేష్, ఓదెలు, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సేవకు సత్కారం... జమ్మికుంట ప్రముఖులకు మహానంది జాతీయ పురస్కారాల వర్షం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** మార్చి 29న తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరిగిన తెలుగు వెలుగు జాతీయ ఉగాది సాహితీసాంస్కృతిక ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రతిభావంతులకు ప్రతిష్టాత్మక మహానంది జాతీయ పురస్కారాలు (నంది అవార్డులు) ప్రదానం చేశారు.



కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాంతానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ అవార్డులను అందుకొని ప్రాంతానికి గౌరవాన్ని తీసుకువచ్చారు. సామాజిక సేవా రంగంలో మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏ. బూషి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడు టంగుటూరి రాజ్‌కుమార్, విద్యాసేవా రంగంలో చిటికెన వేణు, గుడిమిల్ల బలరాం, సామాజిక సేవలో శ్రీరామోజు మహేంద్రచారి, ప్రజా సేవలో గూడూరి శ్రీనివాస్ రెడ్డి, సామాజిక సేవలో రాంపెల్లి జయప్రకాష్ ఈ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు.

ఈ పురస్కారాలను బతుకమ్మ తల్లి గ్రంథకర్త, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత డా. రంగాల శాంతి కృష్ణ ఆచార్య, సినీ హాస్యనటుడు ఆర్.ఎస్. నంద, సహజనటి రాధిక, బూట్ల రాజమల్లయ్య, కాసుల కిరణ్ కుమార్, సంస్థ జాతీయ అధ్యక్షుడు పోలోజ్ రాజ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

ఈ విజయాన్ని పురస్కరించుకుని బుధవారం జమ్మికుంట పట్టణంలోని చాణిక్య డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు దబ్బెట రవీందర్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం నిర్వహించారు. శాలువాలు కప్పి, అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా దబ్బెట రవీందర్ మాట్లాడుతూ, వివిధ రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి మహానంది జాతీయ పురస్కారాలు అందజేసిన తెలుగు వెలుగు సాహితీ వేదికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసుల కిరణ్ కుమార్, బొజ్జ వేణు, దొడ్డె కిరణ్ కుమార్, సైదాబాద్ ఉపసర్పంచ్ ఉప్క మల్ల తిరుపతి, పాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిర్సపల్లి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు ముమ్మరం..

- జేఏసీకి మాజీ ఎమ్మెల్యే సంఘీభావం

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. గత పది రోజులుగా నిరంతర దీక్షలు కొనసాగుతుండగా, ఈ పోరాటానికి మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపారు. బుధవారం జేఏసీ నాయకులతో మాట్లాడిన ఆయన, డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.




ఇదిలా ఉండగా, పట్టణంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొని మానవహారం ఏర్పాటు చేశారు. "చెత్త ప్లాంట్ వద్దు -పట్టణాన్ని రక్షించండి" అంటూ నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో భవిష్యత్తులో తీవ్ర ఆరోగ్య సమస్యలు, పర్యావరణ ముప్పు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇక హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనీయమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఏప్రిల్ 4న చేపట్టనున్న నిరసనల నేపథ్యంలో సీఐడీ నోటీసులు అందినట్లు తెలిపారు. 4న సీఐడీ విచారణకు హాజరై, 5న హుజురాబాద్‌లో పెద్ద ఎత్తున డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఆందోళనలు చేపడతామని వెల్లడించారు. ప్రజల ఆరోగ్యంతో ఎవరైనా చెలగాటమాడితే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం

- భూమి కోల్పోయిన వారికి తక్షణ ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విజ్ఞప్తి

**చర్లపల్లి, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం విషయంలో ఆలస్యంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం భూమి స్వాధీనం చేసుకొని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని వారు పేర్కొన్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. భూమి కోల్పోయిన లబ్ధిదారులకు తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరారు.ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, స్థానిక నాయకులు మత్సగిరి, బాలరాజు, రాజు, మహిళలు మరియు పట్టాలు పొందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నేరెడ్‌మెట్‌లో ఈఓడబ్ల్యూ పోలీస్ స్టేషన్ ప్రారంభం

- భారీ ఆర్థిక మోసాలపై కట్టుదిట్టమైన చర్యలు

**మల్కాజిగిరి, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు ):** ఆర్థిక నేరాలను అరికట్టేందుకు కీలక అడుగుగా నేరెడ్‌మెట్‌లో ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీస్ స్టేషన్‌ను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. సీపీఓ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ స్టేషన్ పోలీస్ క్వార్టర్స్ నుండి కార్యకలాపాలు ప్రారంభించింది. కమిషనర్ జీడీ ఎంట్రీ ద్వారా అధికారికంగా విధులను ప్రారంభించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ విభాగానికి రోడ్ సేఫ్టీ డీసీపీ కె. మనోహర్ పర్యవేక్షకులుగా ఉండగా, ఏసీపీలు పి. సత్తయ్య, సి. అంజయ్య సహాయకులుగా పనిచేయనున్నారు.ఇన్‌స్పెక్టర్లు కె. భాస్కర్, ఎ. సూర్య నాయక్, కె. రవి కుమార్ దర్యాప్తు బాధ్యతలు నిర్వహించనున్నారు.ఈ ఈఓడబ్ల్యూ స్టేషన్ ద్వారా రూ. 2 కోట్లకు పైబడిన భారీ ఆర్థిక మోసాలు, నమ్మకద్రోహం, ఫోర్జరీ కేసులు విచారణకు తీసుకోనున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర డిపాజిటర్ల రక్షణ చట్టం, 1999 (2023 సవరణ) ప్రకారం రూ. 1 కోటి దాటిన డిపాజిట్ మోసాలపై కూడా దర్యాప్తు జరగనుంది. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర కీలక ఆర్థిక నేరాల కేసులను కూడా ఈ విభాగం విచారణ చేస్తుంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్థిక నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# కుషాయిగూడలో మహిళ అదృశ్యం

- ఫిర్యాదుతో కేసు నమోదు
- కుటుంబ కలహాలే కారణమా?



**కుషాయిగూడ, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.నార్త్ కమలానగర్‌కు చెందిన గంప శ్రీనివాస్ (40), కేవీ స్కూల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అతనికి 2012లో గంప కృష్ణవేణి (33)తో వివాహం కాగా, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా దంపతుల మధ్య కుటుంబ విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం.మార్చి 31 ఉదయం శ్రీనివాస్ పనికి వెళ్లగా, పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోయారు. ఈ సమయంలో కృష్ణవేణి తన మామ పతివర్ణ నాగరాజుకు ఫోన్ చేసి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని, పనికి ఆలస్యంగా వెళ్తానని తెలిపింది. అయితే మధ్యాహ్నానికి ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు.అంతకుముందు "షాపింగ్‌కు వెళ్లాను, వస్తాను" అని చెప్పిన కృష్ణవేణి అనంతరం ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.గల్లంతైన కృష్ణవేణి ఎత్తు సుమారు 5 అడుగులు 4 అంగుళాలు, తెలుపు వర్ణం కలిగి ఉండి, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలదు .ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# భార్యను చంపిన భర్తకు ఏడేళ్లు జైలు శిక్ష, 5 వేలు జరిమానా

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్1(తెలంగాణ ముచ్చట్లు)**

క్షణికావేశంలో భార్యను చంపిన భర్తకు ఏడేళ్లు జైలు శిక్ష, 5 వేల రూపాయలు జరిమానా విధిస్తూ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి (ఫ్యామిలీ కోర్టు) ఎం అర్చన కుమారి తీర్పు వెల్లడించారు. వివరాలకు వెళితే.. 2025 ఫిబ్రవరి 20 న మధ్యప్రదేశ్ రాష్ట్రం దిండోరి ప్రాంతానికి చెందిన నిందితుడు కమలేష్‌మరావి (38) అతని భార్య పింకీ మాధవి మిర్చికోత పనులకు నిమిత్తం కారేపల్లి మండలం లక్ష్మీపురం, జైత్రం తండా పంచాయతీ సమీపంలో పలువురు కూలీలతో కలిసి ఉంటున్నారు. ఉదయాన్నే భార్యాభర్తలు గొడవ పడి విచక్షణ కోల్పోయిన భర్త కమలేష్ భార్యను విపరీతంగా కొట్టడంతో మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 45/2025 ఎస్సీ నెంబర్ .78/2025 సెక్షన్ 105 బిఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన అప్పటి విచారణ అధికారలు ఇన్స్పెక్టర్ బి. తిరుపతి రెడ్డి, ఎస్సై. రాజారాం, అదనపు ప్రభుత్వ న్యాయవాది పి స్వప్న,కోర్టు డ్యూటీ ఆఫీసర్/హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వరరావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత్ (ఎస్సై)) కే. శ్రీనివాసరావు, (హెచ్ సి) శ్రీనివాసరావు హోంగార్డ్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీసు అభినందించారు.

# ఇండ్ల స్థలాలకోసం ఆమరణ దీక్షకూ టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధం

- జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏ ఉద్యమమైనా రెడీ
- దశల వారీ పోరాటానికి ఫెడరేషన్ కార్యాచరణ
- అక్రిడిటేషన్ లు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపైనా పోరాటం
- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 1(తెలంగాణ ముచ్చట్లు)**

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనే లక్ష్యంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దీనిలో భాగంగా ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతోందని వెల్లడించారు. ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఇండ్ల స్థలాల సాధన కోసం దశల వారీ పోరాటాలు చేపడుతామని తెలిపారు. తొలుత సంతకాల సేకరణతో కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని అన్నారు. ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలు, కలెక్టరేట్ ముట్టడి, అంతిమంగా ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. అలాగే అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, స్కూల్, కళాశాలల ఫీజుల్లో రాయితీ... తదితరాంశాలపై కూడా సమావేశం చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న హెల్త్ కార్డులు అత్యవసర పరిస్థితుల్లో ఏరకంగానూ జర్నలిస్టులకు ఉపయోగపడటం లేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు సైతం హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ల విషయంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక కార్డులు ఇస్తున్నామని ప్రకటిస్తూనే... మరోవైపు నిబంధనల పేరుతో ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల కార్డులు ఉంటే వాటిని 44 వేలకు పెంచుతున్నట్లు ప్రకటిస్తూ... అర్హతలు, నిబంధనల పేరుతో కోత విధించే చర్యలు ఏమాత్రం సహించరానివని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం విషయంలో కొనసాగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ కొనసాగే నిరసన కార్యక్రమాలు అన్నింటికీ జర్నలిస్టులు జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఇండ్ల స్థలాల కోసం ఇటీవల 14 రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేసిన సంఘం సభ్యుడు కొరకొప్పుల రాంబాబును జిల్లా కమిటీ సన్మానించింది. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవి కిరణ్, టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ బాలకృష్ణ, నలుబోల మధుశ్రీ, జిల్లా సహాయ కార్యదర్శులు కూరాకుల గోపి, జక్కంపూడి కృష్ణ, కెమెరామెన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణేష్, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులు తురగ మూర్తి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గుబాటి మాధవరావు, నూకల రామచంద్రమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీ పాషా, కొత్త యాకేష్, మోహన్ రావు, బంకా వెంకటేశ్వర్లు, కె అచ్చిరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ డివిజన్‌కు నూతన డిప్యూటీ డీఎంహెచ్ఓ

- డా. గొట్టే శ్రవణ్ కుమార్ బాధ్యతలు స్వీకారం



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా (డిప్యూటీ డీఎంహెచ్ఓ) ప్రముఖ వైద్యుడు డాక్టర్ గొట్టే శ్రవణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా సేవలందించిన ఆయన, ప్రజారోగ్య రంగంలో తన అనుభవంతో ఈ కీలక బాధ్యతలను చేపట్టారు.

ఈ సందర్భంగా డా. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, హుజురాబాద్ డివిజన్‌లో ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రతి పేదవారికి సులభంగా అందేలా చర్యలు తీసుకుంటానని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

అంతేకాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరచడం, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వెల్లడించారు. ఆయన నియామకంపై స్థానికులు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సిద్ధగంగ మఠంలో గురువందన మహోత్సవం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం
- సేవా ధర్మం–ఆధ్యాత్మికత అనుసంధానం పై దృష్టి
- పేదలకు విద్య అందిస్తున్న మఠానికి ప్రశంసలు




**తుమకూరు, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లాలో ఉన్న సిద్ధగంగ మఠంలో డాక్టర్ శ్రీ శ్రీ శివకుమార మహాస్వామీజీ 119వ జయంతి, గురువందన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ కృషి, ప్రజాసేవ, జాతీయ సేవ అన్నీ ఒకదానికొకటి అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. సమాజానికి సేవ చేయాలంటే ఆధ్యాత్మికత అనే పునాది ఎంతో అవసరమని ఆమె స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత మనిషిని సేవా మార్గంలో నడిపిస్తుందని, దీర్ఘకాలికంగా సమాజానికి మేలు చేసే శక్తిని అందిస్తుందని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ప్రజా సేవలో నిబద్ధత పెంపొందించడానికి ఆధ్యాత్మికత కీలక పాత్ర పోషిస్తుందని ఆమె వివరించారు. డాక్టర్ శ్రీ శ్రీ శివకుమార మహాస్వామీజీ స్ఫూర్తితో నడుస్తున్న సిద్ధగంగ మఠం పేద మరియు వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యను అందిస్తూ గొప్ప సేవ చేస్తున్నదని రాష్ట్రపతి కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఈ మఠం ఒక ఆధారంగా నిలుస్తోందని అన్నారు. విద్య ద్వారా సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. మఠం చేస్తున్న సేవలు సమగ్ర సమాజ నిర్మాణానికి దోహదం చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి సేవా సంస్థలు దేశ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. సేవా భావంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, సమాజ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.


# హార్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ప్రధాని కీలక వ్యాఖ్యలు

- ప్రపంచ సదస్సుకు యూకే సిద్ధం
- యుద్ధంలోకి దిగబోమని స్పష్టం చేసిన కీర్ స్టార్మర్
- ఇంధన సరఫరాపై ప్రభావం – జీవన వ్యయం పెరుగుదలపై ఆందోళన



**లండన్, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల ప్రభావంతో హార్మూజ్ జలసంధిలో తీవ్ర అంతరాయాలు నెలకొన్న నేపథ్యంలో యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిచే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరిపేందుకు ప్రపంచ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, హార్మూజ్ జలసంధి సమస్య పరిష్కారానికి అందుబాటులో ఉన్న ప్రతి దౌత్య మార్గాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అయితే ఈ సంక్షోభంలో యుద్ధపరమైన జోక్యం అవసరం లేదని, యునైటెడ్ కింగ్‌డమ్ ఎట్టి పరిస్థితుల్లోనూ యుద్ధంలోకి దిగబోదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఈ అంశంపై అమెరికా మాజీ అధ్యక్షుడు చేసిన హెచ్చరికలపై కూడా స్టార్మర్ స్పందించారు. యూకే తన మాట వినకపోతే అమెరికా సహాయం అందించబోదన్న వ్యాఖ్యల నేపథ్యంలో, దేశ ప్రయోజనాలే తమకు ప్రధానం అని స్పష్టం చేశారు. ఎవరెంత ఒత్తిడి తీసుకువచ్చినా బ్రిటన్ జాతీయ ప్రయోజనాల దిశలోనే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణల ప్రభావం యూకే ఆర్థిక వ్యవస్థపై పడుతోందని స్టార్మర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇంధన సరఫరాకు అంతరాయం కలగడం వల్ల జీవన వ్యయం పెరుగుతున్నదని తెలిపారు. ఈ పరిస్థితి సాధారణ ప్రజలపై మరింత భారం మోపుతోందని ఆయన అన్నారు. అయితే ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని స్టార్మర్ ధైర్యం వ్యక్తం చేశారు. అవసరమైన చర్యలు తీసుకుంటూ ఇంధన భద్రతను కాపాడే ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.అమెరికాతో సంబంధాల కంటే ప్రస్తుతం ఐరోపా దేశాలతో బలమైన భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడం యూకేకు మరింత ప్రయోజనకరమని స్టార్మర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సహకారంతో ఈ సంక్షోభానికి పరిష్కారం కనుగొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# మళ్లీ భారత్‌కు ఇరాన్ చమురు




- ఆంక్షల సడలింపుతో కొత్త పరిణామం
- అమెరికా నిర్ణయంతో ఇరాన్ చమురు దిగుమతులకు మార్గం
- గుజరాత్ వాడినార్ పోర్టుకు ట్యాంకర్ ప్రయాణం
- 2019 తర్వాత మొదటిసారి సరఫరా పునఃప్రారంభం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య కీలక పరిణామంగా ఇరాన్ ముడి చమురుపై ఉన్న ఆంక్షలను అమెరికా సడలించడం అంతర్జాతీయ ఇంధన రంగంలో చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంతో భారత రిఫైనరీలు మళ్లీ ఇరాన్ చమురు కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. ఖర్గ్ ద్వీపం వద్ద మార్చి 4న ఈ ట్యాంకర్‌లో ముడి చమురు లోడింగ్ చేసినట్లు సమాచారం. డేటా ఇంటెలిజెన్స్ సంస్థ క్లెప్లర్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ట్యాంకర్ ఏప్రిల్ 4న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. ఈ ట్యాంకర్‌లో సుమారు 6 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ చమురును భారత్‌లో ఏ రిఫైనరీ వినియోగించనుందనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత లేదు. అయినప్పటికీ, ఇరాన్ నుంచి చమురు రవాణా పునఃప్రారంభం కావడం మార్కెట్‌లో కీలక సంకేతంగా భావిస్తున్నారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2019 తర్వాత ఇరాన్ ముడి చమురు భారత్‌కు రావడం ఇదే తొలిసారి. అమెరికా ఆంక్షల కారణంగా గతంలో పూర్తిగా నిలిచిపోయిన ఈ సరఫరా ఇప్పుడు మళ్లీ ప్రారంభం కావడం ఇంధన రంగంలో కొత్త మార్పులకు దారి తీస్తోంది. గతంలో భారత్‌కు ఇరాన్ ముఖ్య చమురు సరఫరాదారుగా ఉండేది. ఒక దశలో దేశం దిగుమతి చేసుకునే మొత్తం చమురులో సుమారు 11.5 శాతం ఇరాన్ నుంచే వచ్చేది. 2018లో రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల వరకు దిగుమతి చేసుకున్న భారత్, 2019 మే నాటికి అది 2,68,000 బ్యారెళ్లకు తగ్గించింది. అమెరికా ఆంక్షల కారణంగా ఆ తర్వాత ఇరాన్ నుంచి చమురు దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు ఆంక్షల సడలింపుతో మళ్లీ ఇరాన్ చమురు భారత్‌కు చేరుకోవడం ప్రారంభమవుతుండటంతో భవిష్యత్తులో ఇంధన సరఫరా, ధరలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## లచ్చమ మసంద్ పురాతన ఆలయానికి ఆర్థిక సహాయం..






- **పునరుద్ధరణకు ముందుకొచ్చిన దాతలు**

**మహబూబ్‌నగర్,ఏప్రిల్01 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్‌నగర్ సమీపంలో ఉన్న శ్రీ లోకమసంద్ మహారాజ్ దేవాలయం పక్కన ఉన్న లచ్చమ మసంద్ పురాతన ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకొచ్చారు. కాలక్రమేణా పాతబడిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ కమల మధు (రిటైర్డ్ జేడబ్ల్యూఎం డిఫెన్స్) కుటుంబ సభ్యులు సహాయం అందించారు. కేతావత్ కమల మధు దంపతులు, కేతావత్ మాధవి సందీప్, కేతావత్ వందన సంతోష్ దంపతులు కలిసి ఆలయంలో టైల్స్, గ్రానైట్ ఏర్పాటు చేయించడంతో పాటు నీటి పైపులైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యలతో ఆలయానికి కొత్త రూపు తీసుకువచ్చారు. దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందుతుండటంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని కోరుతున్నారు.

## గురు లోక మసంద్ మహరాజ్ జాతరకు రాష్ట్ర పండుగ హోధా

- **హర్షం వ్యక్తం చేసిన బంజారా రాష్ట్ర సంఘం**



**హైదరాబాద్,ఏప్రిల్01(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా శ్రీశ్రీ గురు లోక మసంద్ మహరాజ్ జాతరను రాష్ట్ర పండుగగా జరపడానికి జి.ఓ. నం.32 జారీ చేయడం పట్ల బంజారా సమాజం ఆనందం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాన్ని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ తెలంగాణ రాష్ట్ర శాఖ స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ గురు లోక మసంద్ మహరాజ్ పుణ్యక్షేత్రం శతాబ్దాల చరిత్ర కలిగినదిగా, భక్తుల కోరికలు తీర్చే పవిత్ర స్థలంగా ప్రసిద్ధి చెందింది. 17వ శతాబ్దంలో ఇక్కడ జీవ సమాధి పొందిన మహరాజ్ స్మరణార్థం నిర్వహించే జాతరకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడం బంజారా సమాజానికి గౌరవంగా భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా బంజారా సంప్రదాయాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడమే కాకుండా, భవిష్యత్ తరాలకు సంస్కృతి పరిరక్షణకు బలమైన పునాది పడుతుందని సంఘం అభిప్రాయపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ జాతరను ఘనంగా నిర్వహించడం వల్ల దేశవ్యాప్తంగా బంజారా సంప్రదాయాలకు మరింత గుర్తింపు లభించే అవకాశం ఉందని పేర్కొంది. ఇలాంటి మరిన్ని నిర్ణయాలు తీసుకుని గిరిజన సమాజ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, ముఖ్యంగా రాష్ట్ర మంత్రివర్గంలో బంజారా ప్రతినిధికి స్థానం కల్పించాలని సంఘం అధ్యక్షుడు మోహన్ సింగ్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు ఇద్దరు మృతి


- **ముప్పారం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం**
- **ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు**



**ధర్మసాగర్,ఏప్రిల్01(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలం ముప్పారం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద తీవ్రత వల్ల అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన వారిగా బాధితులను గుర్తించారు. మృతి చెందిన వారు ఒకే కుటుంబానికి చెందిన ఏనుగుల శివ, లోకేష్‌గా సమాచారం అందింది. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనపై ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు వివరాలు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యా

## 2 లక్షల 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రణాళిక..

- **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ -01(తెలంగాణ ముచ్చట్లు):** రబీ (యాసంగి) సీజన్ 202526 నందు ఖమ్మం జిల్లాలో 2 లక్షల 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్, బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ 202526 లో ఖమ్మం జిల్లా పరిధిలో 2 లక్షల 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉంటుందని, రైస్ మిల్లర్లు కనీసం లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దింపుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లర్ల నుంచి గన్ని సంచుల సేకరణ సమయంలో చెక్ చేసి నాణ్యత అంశం సర్టిఫై చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. మిల్ పాయింట్ వద్దే గన్ని సంచుల నాణ్యత పరిశీలన ఉంటుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం రవాణా సంబంధించి పెండింగ్ బకాయిల బిల్లు సమర్పించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్ సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## సైనికులుగా మారే గ్రామీణ కలలకు దారి – "సైనిక గ్రూప్"

- **గంభీర్‌పూర్ యువకుడి ప్రత్యేక ప్రయాణం**
- **గ్రామీణ యువతకు సైనిక దశ,దిశ**
- **అరిగే లోకేష్ ముదిరాజ్ సేవలు ప్రశంసనీయం**

**దుబ్బాక,ఏప్రిల్01(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ యువతకు సైన్యంలో చేరాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన అరిగే లోకేష్ ముదిరాజ్ యువతకు దారిచూపుతున్నారు. ఆయన ప్రారంభించిన 'సైనిక గ్రూప్' ద్వారా వేలాది మంది నిరుపేద నిరుద్యోగులకు శిక్షణ అందిస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నారు.2022లో వాట్సాప్ వేదికగా ప్రారంభమైన ఈ గ్రూప్ నేడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, ఆర్మీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ వంటి ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, నోట్స్ అందించడంతో పాటు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోంది. తెలంగాణలో ప్రతి జిల్లాకు ఇన్చార్జులను నియమించి, ఐడి కార్డులు జారీ చేసి క్షేత్రస్థాయిలో యువతకు అండగా నిలుస్తున్నారు. డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌ల వంటి వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ సమాజంలో సానుకూల మార్పుకు కృషి చేస్తున్నారు. 'భవిష్య భారత్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించి, మాజీ సైనికులచే శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమాల ఫలితంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారు 9,000 మంది శిక్షణ పొందుతుండగా, ఇప్పటికే 175 మంది కేంద్ర బలగాల్లో ఉద్యోగాలు సాధించడం విశేషం.లోకేష్ ముదిరాజ్ సేవలను గుర్తిస్తూ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, చోళన్ వరల్డ్ రికార్డ్, మనం బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డులు లభించాయి. ప్రభుత్వం సహకరిస్తే మరింత మంది పేద యువతను సైనికులుగా తీర్చిదిద్దగలనని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## వరంగల్‌లో ప్రత్యేక డాప్లర్ వాతావరణ రాడార్, అదనపు భూకంప పరిశీలనా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- **భూకంప ప్రమాదాలు, వాతావరణ హెచ్చరిక వ్యవస్థలపై లోక్‌సభలో ఎంపీ కావ్య ప్రశ్న**



**హైదరాబాద్,ఏప్రిల్01 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో పట్టణ విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతమవుతున్న నేపథ్యంలో భూకంప సంబంధిత ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. వర్షాలు, ఉష్ణతరంగాలు, ఉరుములు-మెరుపులకు ముందస్తు హెచ్చరికలు అందించేందుకు ప్రత్యేక డాప్లర్ వాతావరణ రాడార్ లేదా ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలపై వివరాలు కోరారు.
అదేవిధంగా వరంగల్ వంటి ప్రాంతాల్లో వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యం పెంపు, విపత్తు నిర్వహణ చర్యలపై కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరారు. భూకంప పరిశీలనా కేంద్రాలు, ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు, పరిశోధన కేంద్రాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం అవసరమని సూచించారు. ఈ ప్రశ్నకు భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వరంగల్ జిల్లా సీస్మిక్ జోన్IIలో ఉందని, ఇది తక్కువ ప్రమాద స్థాయి ప్రాంతమని తెలిపారు. జిల్లాలో మైక్రోజోనేషన్ అధ్యయనాలు ఇంకా చేపట్టలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐదు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. వరంగల్‌కు ప్రత్యేక డాప్లర్ వాతావరణ రాడార్ ఏర్పాటు ప్రణాళికలో లేదని, హైదరాబాద్, విశాఖపట్నం కేంద్రాల్లో ఉన్న ఎస్‌బ్యాండ్ రాడార్లు పూర్తి కవరేజ్ ఇస్తున్నాయని తెలిపారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేస్తూ నౌకాస్ట్‌లు, మొబైల్ యాప్‌లు, అలర్ట్‌ల ద్వారా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నట్లు చెప్పారు. అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వరంగల్‌లో ప్రత్యేక డాప్లర్ వాతావరణ రాడార్ ఏర్పాటు, అదనపు భూకంప పరిశీలనా కేంద్రాలు, ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల విస్తరణ, పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి ఈ మౌలిక వసతులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

## పారాక్వాట్ గడ్డిమందు అమ్మితే కఠిన చర్యలు: మంత్రి తుమ్మల



**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్1(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో అత్యంత ప్రమాదకరమైన గడ్డిమందుగా గుర్తించబడిన పారాక్వాట్ వినియోగం నియంత్రించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో పారాక్వాట్ గడ్డిమందును నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఉత్తర్వులు నేటి నుండి అమలులోకి వచ్చి, తదుపరి 60 రోజులపాటు పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలపై పూర్తి నిషేధం అమల్లో ఉంటుందని వెల్లడించారు. బుధవారం వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఆయిల్‌ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పారాక్వాట్ గడ్డిమందు వరి, పత్తి, మొక్కజొన్న, ద్రాక్ష కూరగాయల సాగులో కలుపు నియంత్రణ కోసం విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, ఇది అత్యంత విషపూరితమైనదని పేర్కొన్నారు. ఈ మందు పొలాల్లో పిచికారి చేసే సమయంలో చర్మంపై కానీ కళ్లలో పడటంతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఏర్పడటంతో పాటు మరణాలు కూడా సంభవిస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా, క్షణికావేశం లేదా ప్రమాదవశాత్తు దీనిని తాగడంతో రాష్ట్రంలో ఇప్పటివరకు 1167 మరణాలు నమోదైనట్లు వైద్య విభాగం వెల్లడించిందన్నారు. దీనికి సమర్థమైన విరుగుడు మందు లేకపోవడం కూడా మరణాల సంఖ్య పెరగడానికి కారణమని వివరించారు. పారాక్వాట్ మనిషి శరీరంలోకి ప్రవేశించినపుడు జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేసి, శరీర అవయవాలు క్రమంగా పనిచేయకుండా చేస్తుందన్నారు. ఇది మనుషుల ఆరోగ్యానికి మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్రమైన హానిని కలిగిస్తుందని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలు, నిల్వలు, పంపిణీ మరియు వినియోగంపై తక్షణ నిషేధం విధించినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ వేదికల ద్వారా పారాక్వాట్ విక్రయాలను కూడా పూర్తిగా నిలిపివేయడానికి విజిలెన్స్, సైబర్ క్రైమ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ఈ గడ్డిమందు అమ్మకాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులందరూ పారాక్వాట్ గడ్డిమందుకు బదులుగా ప్రత్యామ్నాయ గడ్డిమందులను వినియోగించాలని సూచించారు.

**అకాల వర్షాలకు 31 వేల ఎకరాల పంట నష్టం**

రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు 86 మండలాలలో 31,504 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసారు. ఇందులో మొక్కజొన్న 15,991 ఎకరాలు, వరి 7,839 ఎకరాలు, నువ్వులు 787 ఎకరాలు, పొద్దుతిరుగుడు 153 ఎకరాలు మరియు జొన్న 298 ఎకరాలలో నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. యూరియా నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని వ్యవసాయశాఖ సెక్రటరీని సూచనలు చేశారు. ఇటీవల వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్, ఢిల్లీలోని కేంద్ర అధికారులను కలవడంతో రాష్ట్రానికి ఏప్రిల్ నెలలో 2 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించిందని తెలిపారు. ఇందులో దేశీయంగా ఉత్పత్తి అయ్యే యూరియాలో ఆర్ఎఫ్‌సీఎల్ కంపెనీ నుండి 63,020, క్రిబ్‌కో నుంచి 18 వేలు, స్పైసిక్ 9,500, ఆర్సీఎఫ్‌తాల్ 5300, ఇఫ్‌కో 32,500, ఎంసీఎఫ్ఎల్ 2వేలు, జీఎస్ఎఫ్‌సీ 2 వేలు, ఆర్సీఎఫ్‌ట్రమ్‌బే 1000, ఎంఎఫ్ ఎల్ 100 మొత్తం 1,33,420 మెట్రిక్ టన్నులు, దిగుమతి చేసుకునే యూరియాలో సీఐఎల్‌కంపెనీ నుండి 11 వేలు, ఐపీఎల్‌జీసీవీఎం మంగళూరు 31 వేలు, క్రిబ్‌కో 11,500, ఎన్ఎఫ్ ఎల్‌వైజాగా 13,200 మొత్తం 66,700 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. అధికారులు పై కంపెనీలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కేటాయించిన యూరియా ఈ నెలలోనే రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రెండు నెలలు కూడా నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చేలా, కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా యూరియా యాప్ ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు నేరుగా లబ్ధి చేకూరేలా అమలు విధానాన్ని మార్చడానికి సాధ్యసాధ్యాలు పరిశీలించి, ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలు రైతులకు అవగాహన సదస్సులు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపటి నుండి జరిగే గ్రామసభలలో వ్యవసాయ అధికారులు పాల్గొని వ్యవసాయ యాంత్రీకరణలో రైతులకు ఉపయోగపడేవిధంగా సబ్సిడీ విధానంపై సలహాలు, సూచనలు తీసుకోవడంతోపాటు ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా రైతులకు సేంద్రియ వ్యవసాయం, పంటమార్పిడి ప్రాముఖ్యత, మట్టి నమూనా పరీక్షలు పారాక్వాట్ గడ్డిమందు నిషేధంపై అవగాహన, అనుమతిలేని హెచ్‌టీ పత్తి విత్తనాల కొనుగోళ్లు చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 2 నుండి జరిగే ఈ గ్రామసభలలో వ్యవసాయశాఖ తరపున చేపట్టే అవగాహన కార్యక్రమలు విజయవంతం చేసేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖ నుండి రాష్ట్రస్థాయి అధికారులను 32 జిల్లాలకు నోడల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వచ్చే రెండు నెలల్లో ప్రతి రెవిన్యూ గ్రామం నుంచి ఇద్దరు కానీ ముగ్గురు యువకులకు నేల ఆరోగ్యం పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి లోని 31 రైతు విజ్ఞాన కేంద్రాలు, 15 పరిశోధనా సంస్థల్లో సుమారు 30 వేల మంది వాలంటీర్లకి ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఏ పంటలు వేస్తే రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందో రైతులకు అవగాహన కలుగుతుందని దీంతో పంటల మార్పిడి కి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గం నుండి సాయిల్ హెల్త్ వాలంటీర్లను ఎంపిక చేసి వారికి, అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులకు ఏప్రిల్ 6, 7 న ఇక్రిశాట్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాలో ఆయిల్ పామ్ ను ప్రోత్సహిస్తే ముఖ్యమంత్రి కోరిన విధంగా కొడంగల్ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి వీలుంటుందని అన్నారు. అదేవిధంగా గద్వాల్ జిల్లాలోని బీచుపల్లిలో గల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రామ్ చరణ్ కంటి దగ్గర గాయం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గాయపడిన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులను ఆందోళనకు గురిచేసిన ఈ ఘటనపై క్లారిటీ వచ్చింది.
'ఆర్ఆర్ఆర్' తర్వాత వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న చరణ్, ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానాతో 'పెద్ది' సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.
ఇటీవల 'పెద్ది' షూటింగ్ సందర్భంగా యాక్షన్ సీన్ చిత్రీకరిస్తుండగా ప్రమాదం జరిగింది. డూప్ లేకుండా స్టంట్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో చరణ్ కంటి పైభాగంలో గాయం అయింది. వెంటనే చిత్రబృందం చికిత్స అందించగా, వైద్యులు నాలుగు కుట్లు వేశారు.
ఈ వార్త బయటకు రావడంతో అభిమానులు తీవ్రంగా ఆందోళన చెందారు. అయితే ఇది పెద్ద ప్రమాదం కాదని, చరణ్ పూర్తిగా సురక్షితంగా ఉన్నారని మూవీ యూనిట్ స్పష్టం చేసింది. గాయం అయినప్పటికీ చరణ్ తన డెడికేషన్‌ను చూపించాడు. డాక్టర్లు విశ్రాంతి సూచించినా, మరుసటి రోజే షూటింగ్‌కు హాజరయ్యాడు. కంటిపై కట్టుతోనే షూటింగ్‌లో పాల్గొనడం ఆయన కమిట్‌మెంట్‌కు నిదర్శనం. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫోటోలో చరణ్ రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. కంటి దగ్గర గాయం స్పష్టంగా కనిపించినా, ముఖంపై చిరునవ్వుతో అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. త్వరలోనే పూర్తిగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం.





# లేడీ డైరెక్టర్ చున్నీతో సంగీత్ శోభన్ చేసిన పని వైరల్..

టాలీవుడ్‌లో యంగ్ హీరో సంగీత్ శోభన్, లేడీ డైరెక్టర్ మానస శర్మతో కలిసి చేసిన ఓ చిన్న ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'రాకాస' సినిమా ప్రమోషన్స్ సందర్భంగా జరిగిన ఈ సంఘటనపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు.
తెలుగు సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు అరుదుగా కనిపించే సమయంలో, తనదైన స్టైల్‌తో గుర్తింపు తెచ్చుకుంటున్న మానస శర్మ, ఇప్పుడు రాకాస సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల నిర్మిస్తుండగా, జీ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఏప్రిల్ 3న ఈ సినిమా విడుదల కానుంది.
ఇటీవల మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ఓ ఈవెంట్‌లో, సంగీత్ శోభన్ తన పక్కన నిలబడి ఉన్న మానస శర్మ చున్నీతో అనుమతి లేకుండానే తన కళ్లద్దాలు తుడుచుకోవడం కనిపించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, నెటిజన్లు దీనిపై విభిన్నంగా కామెంట్లు చేస్తున్నారు.
కొంతమంది ఇది సరదాగా జరిగిన విషయం అని భావిస్తుండగా, మరికొందరు మాత్రం "అనుమతి తీసుకుని ఉండాలి" అంటూ అభిప్రాయపడుతున్నారు. "మానస శర్మ చాలా సింపుల్‌గా తీసుకుంది గానీ, వేరే వాళ్లైతే సీరియస్ అయ్యేవాళ్లు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక దర్శకురాలు మానస శర్మ కెరీర్ విషయానికి వస్తే.. శ్రీకాకుళంలో ప్రారంభమైన ఆమె ప్రయాణం యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ 'మ్యాడ్ హౌస్'తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత వెబ్ సిరీస్‌లతో తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకుని, ఇప్పుడు ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌తో అడుగు పెడుతోంది.
మొదట 'రాకాస' కథను వెబ్ సిరీస్‌గా తెరకెక్కించాలని భావించినప్పటికీ, సంగీత్ శోభన్ ఎంట్రీతో ఈ ప్రాజెక్ట్‌ను సినిమాగా మార్చినట్లు తెలుస్తోంది. కథ విన్న వెంటనే నిహారిక కొణిదెల నిర్మాణానికి ముందుకు రావడం విశేషం. బడ్జెట్ పెరిగినా, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదని చిత్రబృందం చెబుతోంది. హర్రర్, కామెడీ, ఫాంటసీ ఎలిమెంట్స్ మేళవించిన ఈ సినిమా థియేటర్‌లో మంచి అనుభూతిని ఇస్తుందని దర్శకురాలు నమ్మకం వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్న 'రాకాస' టీమ్, ఈ వైరల్ ఘటనతో మరింత హైలైట్ అయింది.



## పెళ్లిపై సాయి పల్లవి సంచలన వ్యాఖ్యలు..

టాలీవుడ్‌లో తన సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సాయి పల్లవి మరోసారి తన ఆలోచనా విధానంతో అందరి దృష్టిని ఆకర్షించింది. పెళ్లి అనే అంశంపై ఆమె చేసిన తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి.
ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సాయి పల్లవి.. పెళ్లి గురించి సమాజంలో ఉన్న విభిన్న అభిప్రాయాలపై మాట్లాడింది. "చాలామంది పెళ్లి చేసుకున్న తర్వాత మిగతావారికి 'పెళ్లి చేసుకోకపోవడమే మంచిది' అని చెబుతుంటారు. అలాంటి మాటలు వింటూ పెరిగిన నేను, ఒక దశలో పెళ్లిపై పెద్దగా పాజిటివ్ అభిప్రాయం ఏర్పరుచుకోలేకపోయాను" అని ఆమె చెప్పింది.
అయితే ఈ అభిప్రాయం ఒక్క వైపు మాత్రమే కాదని, పెళ్లి అనే బంధం మనిషి జీవితంలో ఎంతో ముఖ్యమని కూడా ఆమె స్పష్టం చేసింది. "నన్నడిగితే ప్రతి బంధానికి మూలం పెళ్లే. ఒక కుటుంబం, ఒక వ్యవస్థ, అనుబంధాలు— ఇవన్నీ పెళ్లి వల్లే ఏర్పడతాయి. మనిషి జీవితంలో అనుభవించే అనేక భావోద్వేగాలకు, అనుబంధాలకు ఇది పునాది" అని వివరించింది.
తన భావనను మరింత బలంగా చెప్పడానికి సాయి పల్లవి ఒక భావోద్వేగ ఉదాహరణను ఇచ్చింది. "మనకు చిన్న చిన్న విషయాల్లో కూడా ఆదరణ అవసరం అవుతుంది. ఉదాహరణకు.. మనం మధ్యరాత్రి భోజనం చేయకుండా అలుగుతుంటే, మనల్ని బుజ్జగించి తినిపించేది అమ్మ మాత్రమే. ఆ అమ్మ అనే బంధం ఎలా ఏర్పడింది? అది కూడా పెళ్లి అనే వ్యవస్థ వల్లే కదా" అని ప్రశ్నించింది.
ఆమె మాటల్లో పెళ్లిపై విమర్శ మాత్రమే కాకుండా, దాని గొప్పతనాన్ని గుర్తించే పరిపక్వత కనిపించడం విశేషం. ఒకవైపు నేటి తరం పెళ్లి అనే బంధాన్ని లైట్‌గా తీసుకుంటున్న తరుణంలో, మరోవైపు ఆ బంధం వెనుక ఉన్న భావోద్వేగ విలువలను గుర్తు చేస్తూ సాయి పల్లవి చెప్పిన మాటలు నెటిజన్లను ఆలోచింపజేస్తున్నాయి. సాయి పల్లవి వ్యక్తిత్వానికి తగ్గట్టుగానే ఆమె అభిప్రాయాలు కూడా ఎప్పుడూ నిష్కపటంగా, నిజాయితీగా ఉంటాయని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ తన ఆలోచనలతో ప్రత్యేకతను చాటుకుంటున్న ఆమె, మరోసారి తన మాటలతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది.



# ఐదు భాషల్లో ఫుల్ బిజీగా ఉన్న లేడీ సూపర్ స్టార్

దక్షిణ భారత సినీ పరిశ్రమలో లేడీ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన నయనతార ప్రస్తుతం ఐదు భాషల్లో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారింది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ, మలయాళం, ఇప్పుడు కన్నడలో కూడా సినిమాలు చేస్తూ తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది.
'లేడీ సూపర్ స్టార్' అనే బిరుదుతో ప్రేక్షకుల మన్ననలు పొందిన నయనతార, బాలీవుడ్‌లోకి కూడా విజయవంతంగా అడుగుపెట్టింది. జవాన్ సినిమాలో షారుఖ్ ఖాన్ సరసన నటించి తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది.
నయనతార అసలు పేరు డయానా మరియం కురియన్. 2003లో మలయాళ చిత్రం 'మనసీనక్కరే'తో సినీ ప్రయాణం ప్రారంభించింది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తమిళంలో 'అయ్యా' ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. తెలుగులో శ్రీరామరాజ్యం సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ఈ చిత్రానికి ఫిలింఫేర్ అవార్డును కూడా అందుకుంది. కెరీర్‌లో మాత్రమే కాదు, వ్యక్తిగత జీవితంలోనూ ఆమె ఎన్నో మార్పులు చూసింది. 2022లో దర్శకుడు విఘ్నేష్ శివన్ను వివాహం చేసుకుంది. తర్వాత సరోగసీ ద్వారా ఇద్దరు పిల్లలకు తల్లిగా మారింది.
ప్రస్తుతం నయనతార దక్షిణ భారతంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో ఒకరిగా నిలిచింది. ఒక్కో సినిమాకు రూ.2025 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు సమాచారం.
ఇక సినిమాల విషయంలో ఆమె స్పీడ్ మరింత పెంచింది. ఇప్పటికే పలు ప్రాజెక్టులు లైన్లో ఉండగా, ఐదు భాషల్లో సినిమాలు చేస్తూ యమా బిజీగా కొనసాగుతోంది. ఇదే కారణంగా నయనతార క్రేజ్ రోజురోజుకూ పెరుగుతూ 'లేడీ సూపర్ స్టార్' బిరుదుకు తగినట్లుగా దూసుకుపోతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in